


యోగాలో శిక్షణ

తాడికొండ: మోతడక చలపతి ఫార్మసీ కళాశాలలో శనివారం యోగాలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరామారావు మాట్లాడారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 577.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,086 క్యూసెక్కులు వదిలారు.

తమలపాకులతో అలంకరణ



తెనాలి: మారీసుపేటలోని బాలా త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో వీరాంజనేయస్వామికి తమలపాకులతో అలంకరణ చేశారు. శనివారం హారతి, మంత్ర పుష్పం సమర్పించారు.

న్యూస్‌రీల్

ప్రకాశం జిల్లా డీఎంఅండ్ హెచ్‌ఓగా వెంకటేశ్వర్లు



బాపట్లటౌన్: బాపట్ల జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ తెలగతోటి వెంకటేశ్వర్లు పదోన్నతిపై ప్రకాశం జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

కొండచిలువ కలకలం



మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల పైలాన్ సమీపంలో శుక్రవారం రాత్రి భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. కొండ సమీపంలో నుంచి వచ్చిన కొండచిలువ సుమారు 8.1/2 అడుగుల పొడవున ఉంది. స్థానికులు దీన్ని గుర్తించి చాకచక్యంగా పట్టుకొని అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. అక్కడకు చేరుకున్న అధికారులు కొండచిలువను తీసుకుపోయారు. ఘటన జరిగిన స్థలానికి మేదరమెట్ల ఎస్‌ఐ రఫీ వచ్చి పరిశీలించారు.

సబ్‌జైలు సందర్శన



సత్తెనపల్లి: సత్తెనపల్లి సబ్ జైలును గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ పార్థసారథి, గుంటూరు జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) లీలావతి శనివారం సందర్శించారు. సబ్ జైలులోని నిందితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించారు. సరుకుల నాణ్యతను, ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్, ప్యానల్ న్యాయవాది బి.ఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1616 క్యూసెక్కుల విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 68, తూర్పు కెనాల్‌కు 63, పశ్చిమ కెనాల్‌కు 56, నిజాంపట్నం కాలువకు 151, కొమ్మమూరు కాలువకు 1310 క్యూసెక్కులు విడుదల చేశారు.



అన్నదానం నిర్వహిస్తున్న అద్దంకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



బాపట్లలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు తదితరులు

మార్మోగిన జగన్నినాదం

- వైభవంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు
- స్వచ్ఛందంగా పాల్గొన్న ప్రజలు
- కేక్ కటింగ్స్, క్షీరాభిషేకాలతోపాటు సేవా కార్యక్రమాలు

ఊరూవాడా ఉత్సాహం



గుళ్లపల్లి ఈఎస్‌ఆర్ ఆస్పత్రిలో నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చిత్రంలో ఈవూరి గణేష్, వరికూటి అశోక్‌బాబు

బాపట్లటౌన్: పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు తపిస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అంబరాన్నంటాయి. ఫలితంగా ఊరూవాడా ఉత్సాహంతో ఉప్పొంగింది. జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జననేత పుట్టిన రోజును వేడుకగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాల్లో భారీ కేక్‌లు కట్‌చేసి సంబరాలు చేశారు. గ్రామస్తులకు స్వీట్లు పంచిపెట్టారు. ఏరియా వైద్యశాలల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన మేలును ప్రజలు గుర్తుచేసుకున్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేసిన నేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.


- బాపట్లలో మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, పార్టీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డిల ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో కేక్ కట్ చేసి రిక్షా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారప్రతినిధి గవిని కృష్ణమూర్తి, జిల్లా ప్రచార కార్యదర్శి వడ్డిముక్కల డేవిడ్, పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులు జోగిరాజా, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ ఆదేశాల మేరకు పట్టణంలోని గడియారస్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుక నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలో భారీగా ర్యాలీ నిర్వహించి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జయసన్, రూరల్ పార్టీ అధ్యక్షులు అంకాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

- వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. తొలుత అద్దంకి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. పట్టణంలోని పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు జరిగాయి. అమర్తలూరు మండలం, మూల్పూరు, యడవూరు, కొల్లూరు మండల కేంద్రంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. చెరుకుపల్లిలో కేక్ కట్ చేసి వెయ్యి మందికి అన్నదానం, 100 మందితో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రేపల్లె మండలంలోని పలు గ్రామాల్లో, నగరం మండల కేంద్రంలో కేక్ కట్‌చేసి అభిమానులకు సీట్లు పంపిణీ చేశారు. రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లి నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బస్టాండ్ సెంటర్లో భారీ కేక్ కట్ చేశారు. ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ ఆధ్వర్యంలో జరిగాయి. పర్చూరు బొమ్మల సెంటర్‌లో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఇంకొల్లు మండలంలో కన్వీనర్ బండారు ప్రభాకరరావు, చినగంజాంలో పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, యద్దనపూడి మండలంలో ఎంపీపీ పులగం రజని, మార్టూరు మండలంలో కన్వీనర్ పఠాన్ కాలేషావలిల ఆధ్వర్యంలో జగన్ పుట్టిన రోజు వేడుకలు జరిగాయి.

'నీరు'గారిన ప్రజాస్వామ్యం



సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఎన్నికలంటే కూటమి పార్టీలకు చులకనభావమా? ఓటుకు విలువనివ్వకుండా ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్నాయా? స్వపక్ష నేతలు, కార్యకర్తల అభిప్రాయాలకూ విలువనివ్వడంలేదా? తాము చెప్పిన వారికే పదవులంటూ ఏకపక్ష నిర్ణయాలతో కూటమి నేతలు జులుం ప్రదర్శిస్తున్నారా? పోలీసులతో బెదిరింపులకు దిగుతున్నారా? వీటన్నింటికీ స్వపక్ష నేతలు, కార్యకర్తల నుంచి అవుననే సమాధానమే వస్తోంది. సర్కార్ తీరును వారు ఎండగడుతుండడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల తీరు దీనికి నిదర్శనం.

అంతా ఏకపక్షమే!

సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను కూటమి పాలకులు అపహాస్యం చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం అమృతలూరు మండలం కూచిపూడి జలవనరులశాఖ అతిథి గృహంలో కృష్ణా వెస్టర్న్ డెల్టా సాగునీటి ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక జరగ్గా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పార్థసారథి హాజరయ్యారు. రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నంకు చెందిన మురళీధరరావును చైర్మన్‌గా గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన సునీల్ చౌదరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ పదవులను రెండు, మూడేళ్ల చొప్పున పంపకానికి పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఈ నెల 17న ఎన్నికైన 22 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు ఎన్నుకోవాలి. అయితే కూటమి నేతలు దీనికి విరుద్ధంగా వ్యవహరించారు. ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించారు. చినగంజాంకు చెందిన వీరయ్యచౌదరితోపాటు బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు రైతు నేతలు ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ఆశించారు. కానీ జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ జోక్యం చేసుకొని సభ్యుల అభిప్రాయాలకు విలువనివ్వకుండా ఏకపక్షంగా ఎన్నిక నిర్వహించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బెదిరింపుల పర్వం మధ్య..

అంతకు ముందు ప్రాదేశిక సభ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎంపికలోనూ ఏకపక్షంగా వ్యవహరించారు. వాస్తవానికి జిల్లాలో ఉన్న 4 లక్షలమంది రైతు ఓటర్లు 2,040 మంది ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోవాలి. అయితే టీడీపీ నేతల ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతోపాటు పోలీసులు కలిసి బెదిరింపులకు దిగి ప్రాదేశిక సభ్యులను ఏకపక్షంగా ఎంపికచేశారు. ఎన్నిక జరిగిన రోజు మధ్యాహ్నం 170 సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ప్రాదేశిక సభ్యులు ఎన్నుకోవాల్సివుండగా వారి అభిప్రాయాలకు తావివ్వలేదు. వీరంతా కలిసి 22 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాల్సివుండగా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. తాజాగా 22 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఎన్నుకోవాల్సిన ప్రాజెక్ట్ కమిటీని మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రి ఎంపిక చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమిలోని నేతలు ప్రాదేశికాలు, సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీలకు పోటీచేయాలని యత్నించినా తాము ఎంపిక చేసినవారు తప్ప మరెవరూ పోటీ చేయకూడదని పెద్దలు అల్టిమేటం జారీచేయడం విస్తుగొలిపింది.

స్కేటర్ జెస్సీరాజ్‌కు బాల పురస్కార్



మంగళగిరి: పట్టణానికి చెందిన అంతర్జాతీయ స్కేటర్ జెస్సీరాజ్‌ను ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ –2025 వరించింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డు అందుకోనున్నారు. ఏటా 25 మంది బాలలకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ఇస్తుంటుంది. వచ్చే ఏడాది జాబితాను ఇటీవల ప్రకటించింది. ఈ సందర్భంగా జెస్సీరాజ్‌ను పలువురు అభినందించారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధ్యం



కంప్యుటర్ ల్యాబ్ ప్రారంభించిన సీవోఈ సుబ్బారావు

బల్లికురవ: రెండు నెలలు కష్టపడటంతోపాటు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలతో జిల్లా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందవచ్చని రాష్ట్ర ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీవోఈ) ఉమ్మడి గుంటూరు ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఆర్జేడీ వీవీ సుబ్బారావు అన్నారు. శనివారం సాయంత్రం బల్లికురవలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఎంవీ ఫౌండేషన్ నెదర్లాండ్ టీమ్ రూ.4.5 లక్షలతో అందజేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సుబ్బారావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ గతేడాదిలో బల్లికురవ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించటంపై ప్రిన్సిపాల్ ఎం అనిల్‌కుమార్ అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. ఎంవీ ఫౌండేషన్ కళాశాలకు ఐదేళ్లుగా విద్యాభివృద్ధికి చేయూతనిస్తూ, 10 కంప్యూటర్‌లతో ల్యాబ్‌ను అందంగా తీర్చిదిద్దడంపై ఫౌండేషన్ రాష్ట్ర కోర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, మండల కోఆర్డినేటర్ పీ హరిహరరెడ్డిని అభినందించారు. కంప్యూటర్ ల్యాబ్‌తో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం ఫిబ్రవరిలో జరిగే ప్రాక్టికల్స్‌కు మార్చిలో జరిగే ఫైనల్ పరీక్షలకు బల్లికురవ కళాశాలలో పరీక్ష కేంద్రం మంజూరు చేయాలని అభ్యర్థించారని, ఇది పరిశీలనలో ఉందని సీవోఈ వెల్లడించారు. ఈ పరీక్ష కేంద్రంలో బల్లికురవ కళాశాలతోపాటు కేజీబీవీ, వలపర్ల ఉన్నత పాఠశాలలోని ప్లస్ టూ, ఎంఎస్‌ఆర్ కళాశాల విద్యార్థులను ఇక్కడికి కేటాయిస్తామని చెప్పారు. ఉదయం సాయంత్రం స్టడీ అవర్లతో పాటు, విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దాలని అధ్యాపకులను ఆదేశించారు.

మానవ మనుగడకు చెట్లు అవసరం..

మానవ మనుగడకు పచ్చని చెట్లు ఎంతో దోహదపడతాయని, సువిశాలమైన క్రీడా మైదానం ఉన్నందున ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి పోషించాలన్నారు. అనంతరం ఆయన పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీరుపోశారు. కార్యక్రమాల్లో డీఐఈవో యర్రయ్య, ప్రిన్సిపాల్ ఎం అరుణ్ కుమార్, అధ్యాపకులు ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



రేపల్లెరూరల్: పదవ తరగతి విద్యార్థులు రాబోవు పబ్లిక్ పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణతను సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజ దెబోరా కోరారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం 10వ తరగతి వసతి గృహ విద్యార్థినులకు నిర్వహించిన ప్రతిభకు ప్రేరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రణాళికలు ఏర్పరుచుకుని విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. పరీక్షలకు ఉన్న తక్కువ కాలం వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్జెక్ట్‌ల వారీగా పలువురు ఉపాధ్యాయులు పరీక్షలకు సిద్ధం అయ్యే విధానాలను విపులంగా వివరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.చినబసవయ్య అందించిన పరీక్ష సామాగ్రిని 36 మంది విద్యార్థిలకు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు కే.శివకుమారి, అనిల్‌కుమార్, జీ. నాంచారయ్య, పావని, వివిధ వసతి గృహాల అధికారులు పీఎస్ఎస్ ప్రసాద్, శ్రీనివాసరావు, ప్రసన్న, సుజాత, పద్మావతి, నిర్మల పాల్గొన్నారు.

జవాన్ శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలు





ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామానికి చెందిన జవాన్ గాలి శ్రీనివాసరావు (45) లక్నోలోని వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. రెండు నెలల క్రితం అనారోగ్యానికి గురైన శ్రీనివాసరావు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అప్పటి నుంచి వైద్యశాలలోనే చికిత్స పొందుతున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 2003లో ఆర్మీలో చేరిన ఈయన ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జూనియర్ కమిషన్ ఆఫీసర్ (జేసీవో)గా పని చేస్తున్నారు. ఆయన పార్థివ దేహానికి లక్నోలో మిలటరీ అధికారులు నివాళులు అర్పించారు. అనంతరం శనివారం సాయంత్రం ఐలవరం తీసుకు వచ్చారు. శ్రీనివాసరావు భౌతికకాయాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి మిలటరీ అధికారులు, గ్రామస్తులు సైనిక లాంఛనాలతో ఐలవరం శ్మశానవాటికకు తరలించారు. తొలుత శ్రీనివాసరావు భౌతికకాయాన్ని ర్యాలీగా గ్రామానికి తీసుకొచ్చారు. రేపల్లె ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి, తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, రేపల్లె డీఎస్పీ కె.శ్రీనివాసరావు, వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గడ్డం శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ టి. ఊహారాణి, పంచాయతీ కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు, వీఆర్వో లక్ష్మి తదితరులు పాల్గొని జవాన్‌కు నివాళి అర్పించారు.

అక్రమాలపై జాయింట్ కమిషనర్ విచారణ

- అదనంగా డబ్బులు ఇవ్వలేదని ఏడాదిగా లైసెన్స్ రెన్యూవల్ చేయని అధికారులు
- కలెక్టర్‌కు, ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు ఫిర్యాదు
- అవినీతి కంపులో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం



ఫిర్యాదిని విచారిస్తున్న జాయింట్ కమిషనర్ శివరామప్రసాద్

చీరాల: మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. ఆన్‌లైన్ సేవలు ఉన్నప్పటికీ ఏజెంట్‌ల ద్వారా వస్తేనే పనులు చేస్తున్నారు. నేరుగా ఆన్‌లైన్‌లో పెట్టుకుంటే ఆ ఫైలును పక్కన పడవేస్తున్నారు. దీంతో ఓ బాధితుడు జిల్లా కలెక్టర్, టాన్స్‌పోర్టు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం చీరాల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఫిర్యాది, అధికారులను జాయింట్ కమిషనర్ శివరామప్రసాద్ విచారణ నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. 2023 డిసెంబర్‌లో పాస్టర్ నూకతోటి ప్రభాకర్ తన కారు లైసెన్స్ రెన్యువల్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేశారు. ఏజెంట్ ద్వారా రాలేదనే ఉద్దేశంతో ఆ దరఖాస్తును పక్కన పెట్టారు. ఇలా పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో ప్రజా సంఘాల్లో పనిచేసే ఆనంద్ అనే వ్యక్తి ద్వారా నేరుగా కార్యాలయానికి వెళ్లి ప్రశ్నించడంతో మొదటి చలానా చెల్లదని, సమయం దాటిపోయిందని మరోసారి చలానా కట్టాలని అధికారులు చెప్పడంతో లైసెన్స్ రెన్యూవల్‌కు రెండో సారి చలానా కట్టారు. అప్పుడు కూడా అప్రూవల్ చేయకుండా నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడం ఏంటని, ఏజెంట్ ద్వారా రావాలని సిబ్బంది, అధికారులు ప్రభాకర్‌పై దురుసుగా వ్యవహరించారు. నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అప్రూవల్ చేయడం సాధ్యపడదని ఖరాకండిగా చెప్పారు. దీంతో ఆయన కలెక్టర్, ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఏడాదిపాటు అప్రూవల్ చేయని అధికారులు వెంటనే లైసెన్స్ రెన్యూవల్ చేశారు. ఈ వ్యవహారంపై కూడా ట్రాన్స్‌పోర్టు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విచారణకు ఆదేశించారు. జాయింట్ కమిషనర్ శివరామప్రసాద్ ఫిర్యాది ప్రభాకర్, ఆనంద్‌తో పాటు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, సిబ్బందిని విచారించారు. బాధితుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. నివేదికను ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు అందిస్తామని మీడియాకు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే పల్లెనిద్ర

బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

చినగంజాం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే కాక.. ప్రజలతో చేరువయ్యేందుకే పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు మండలంలోని సోపిరాలలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి, వివాదాలు, అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖను ప్రజలకు చేరువ చేసేందుకు ఎస్పీ పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వస్తే తేలికగా గుర్తించవచ్చని, అటువంటి వ్యక్తులపై అనుమానం కలిగితే స్థానికంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సీసీ కెమెరాల వలన ప్రయోజనాలున్నాయని, ప్రజలు వారి గృహాలకు, వ్యాపార సముదాయాలకు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే స్థానిక పోలీసు అధికారులకు గాని లేదా డయల్ 112కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్, పోలీస్ సిబ్బంది, స్థానికులు టీఎస్సార్ ఆంజనేయులు, కుర్రి రామసుబ్బారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీల తొలగింపులో అధికారుల అత్యుత్సాహం



అద్దంకివారిపాలెం ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఉన్న టీడీపీ ఫ్లెక్సీ



అధికారులు తొలగించిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ

రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వంలో అధికారులు కీలుబొమ్మలుగా పనిచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు చెప్పినట్లు చేస్తూ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ తమ స్థాయిని దిగజార్చుకుంటున్నారు. రేపల్లె నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులతో పాటు అధికారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ముఖ్యంగా నగరం మండలంలో అధికారులు ప్రజాప్రతినిధుల కీలుబొమ్మలుగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను అడ్డుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ నాయకులు, అభిమానులు గ్రామాలలో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తూ కూటమి నేతల మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. మండలంలోని అద్దంకివారిపాలెం, గాలివారిపాలెం గ్రామాలలో అభిమానులు ఏర్పాటు చేసుకున్న వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను పంచాయతీ అధికారులు నిమిషాల వ్యవధిలో తొలగించారు. ఆయా గ్రామాలలో ఎప్పటి నుంచో రహదారుల వెంబడి, ప్రభుత్వ ఆస్తులకు ఉన్న టీడీపీ బ్యానర్‌లను తొలగించకుండా స్వామిభక్తిని చాటుకుంటున్నారు. అదేవిధంగా మండల కేంద్రమైన నగరంలో జగనన్న జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన మైక్‌సెట్‌లను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అదేమని అడిగితే అనుమతులు లేకుండా వేడుకలు ఎలా నిర్వహిస్తారంటూ నిర్లక్ష్య సమాధానాలు చెబుతున్నారు. అద్దంకివారిపాలెం, గాలివారిపాలెం గ్రామాలలో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు తొలగించి, టీడీపీ వారివి తొలగించకపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి లాక్రోస్ పోటీలు



చీరాల: విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ ప్రావీణ్యాన్ని సాధించాలని తద్వారా మానసిక, శారీరక దృఢత్వం సాధ్యమని బాపట్ల జిల్లా ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. చీరాల-కారంచేడు రోడ్డులోని ప్రైడ్ ఇంటర్నేషనల్ పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులు పాటు జరగనున్న రాష్ట్రస్థాయి లాక్రోస్ గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ లాక్రోస్ గేమ్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లాక్రోస్‌లాంటి క్రీడలు ఆడటం ద్వారా క్రీడల్లో ఏ విధంగా అయితే గెలుపు ఓటములు ఉంటాయో, అదే తరహాలో జీవితంలో వచ్చే ఒడిదుడుకులు, ఒత్తిడిని విద్యార్థులు సమర్థవంతంగా ఎదుర్కొంటారన్నారు. స్కూల్ కరస్పాండెంట్, లాక్రోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు మాట్లాడుతూ ఒలంపిక్ అర్హత సాధించిన లాక్రోస్ గేమ్‌ను చీరాలలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 జిల్లాల నుంచి 175 మంది క్రీడాకారులు, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలలో కలిపి 22 జట్లు శనివారం పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీలను లాక్రోస్ గేమ్ ఏపీ క్రీడాభారతి వైస్ ప్రెసిడెంట్ టి.జ్యోత్స్న తదితరులు పర్యవేక్షించారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలపై పోలీసుల ఓవర్ యాక్షన్

తాడికొండ: వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా తాడికొండలో ఏర్పాటు చేసిన మైకులను తొలగించాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారు. కార్యకర్తలు, నాయకులు చిన్నపాటి మైకులు ఏర్పాటు చేసి శనివారం వేడుకలు నిర్వహించుకుంటున్నారు. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయంటూ ఆంక్షల పేరుతో పోలీసులు ఆ మైకులు తొలగించారు. గతంలో ఎన్నడూ లేనంతగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ జన్మదిన వేడుకల విషయంలో పోలీసులు వ్యవహరించడంపై స్థానికులు మండిపడ్డారు.

సంక్షేమం అనే పదానికి అర్థం చెప్పిన నేత వైఎస్ జగన్



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి

నెహ్రూనగర్: రాష్ట్రంలో సంక్షేమం అనే పదానికి అర్థం చెప్పిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చంద్రమౌళి నగర్‌లో కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్ జగన్ పాలనలో పేద ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అందించి వారికి అన్ని విధాలుగా అండగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవుతు వంశీరెడ్డి, శ్రీకాంత్, ఆళ్ల కౌశిక్, ఆళ్ల లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఫైట్‌మాస్టర్

- 20 ఏళ్లుగా క్రిస్మస్ సందర్భంగా సేవా కార్యక్రమాలు
- స్వగ్రామానికి చేయూత కోసమే కింగ్ సాల్మన్ ఫౌండేషన్
- సినీ ఫైట్ మాస్టర్ కింగ్ సాల్మన్



చీరాల టౌన్: వ్యవసాయ కుటుంబంలో జన్మించా. పేద ప్రజల బాధలు కష్టాలు బాగా తెలుసు. సినీ రంగంలో రాణించేందుకు ఎన్నో కష్టాలు పడ్డా. మంచి గుర్తింపు వచ్చిన తర్వాత తాను జన్మించిన ఊరికి, నియోజకవర్గంలో పేదలకు తనవంతుగా సహకారాన్ని అదించేందుకు కింగ్ సాల్మన్ ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తున్నానని సినీ ఫైట్‌మాస్టర్ కింగ్ సాల్మన్ తెలిపారు. శనివారం మండలంలోని ఫైట్‌మాస్టర్ స్వగ్రామం తోటవారిపాలెంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 20 ఏళ్లుగా చేస్తున్న క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తాను సినీరంగంలో అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతు పెద్ద హీరోలకు ఫైట్‌మాస్టర్లుగా పనిచేస్తున్నారన్నారు. తాను ఫైట్‌మాస్టరుగా పనిచేసిన సినిమాలు ఘన విజయాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. సినీ పరిశ్రమలో ప్రతిభ ఉన్నవారికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో నిరుపేదలకు బియ్యం, నూతన వస్త్రాలు బహూకరించడంతో పాటుగా అన్నీ విధాలుగా అండగా నిలిచేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. ఆపదలో ఉన్నవారు, మంచంలో ఉన్నవారు, నిరాశ్రయులైన వారు, ప్రతిభ ఉండి ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు తనవంతుగా సహకారాన్ని అందిస్తానన్నారు. సినీరంగంలో స్టంట్ మాస్టర్ స్థాయికి ఎదిగానని, రెండుసార్లు జాతీయస్థాయి అవార్డులు అందుకున్నాన్నారు. అగ్ర హీరోలైన ప్రభాస్ బాహుబలి, జూనియర్ ఎన్టీఆర్ దేవర, కల్కితో పాటు ప్రస్తుతం ఎస్ఎస్ఎంబీసీ చిత్రానికి ఫైట్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాన్నారు. సెమీక్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఇరవై వేలమంది ప్రజలకు విందును ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎన్నిక



ఎమ్మెల్యే బూర్ల వీరాంజనేయులు,, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, ఇరిగేషన్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమర్తలూరు (వేమూరు): రైతులు సాగు చేస్తున్న చివర భూముల వరకు సాగు నీరు అందజేసేందుకు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించినట్లు బాపట్ల జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండలం కూచిపూడి లాకుల ఇరిగేషన్ కార్యాలయంలో శనివారం పశ్చిమ డెల్టా సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా పి.మురళీధర్, వైస్ చైర్మన్‌గా ఎన్. సునీల్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. చైర్మన్ పదవిలో రెండు సంవత్సరాలు పి.మురళీధర్, మూడు సంవత్సరాలు ఎన్. సునీల్ చౌదరి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పత్తిపాడు

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

బాపట్లటౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని వెదుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని ఓపీ వివరాలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెదుళ్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. చిన్నారులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ వైష్ణవికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.